

అన్నారం బ్యారేజీని పరిశీలిస్తున్న కేటీఆర్

మేడిగడ్డ బ్యారేజీ వద్ద పరిసరాలు పరిశీలిస్తున్న కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్‌రెడ్డి

పంటలు ఎండుతున్నాయి

కోపం ఉంటే మాపై తీర్చుకోండి.. రైతులపై కాదు

- మేడిగడ్డ సందర్శనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నిర్లక్ష్యం చేయకుండా పునరుద్ధరించాలని ప్రభుత్వానికి డిమాండ్
- హరీశ్‌రావు తదితర నేతలతో కలిసి పర్యటన

భూపాలపల్లి/మహదేవపూర్ రూరల్/మహదేవపూర్/కృష్ణకాలనీ, మార్చి 1 : కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణి కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వానికి తమపై కోపముంటే తమపైనే చూపాలి కానీ రైతులపై చూపొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారకరామరావు పేర్కొన్నారు. చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా రోడ్డు మార్గాన హైదరాబాద్ నుంచి బస్సుల్లో మేడిగడ్డకు చేరుకున్న కేటీఆర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధుల బృందం బ్యారేజీ ముఖద్వారం నుంచి ప్రత్యేక వాహనాల్లో కుంగిన ప్రాంతానికి వెళ్లారు. పగుళ్లు తేలిన పిల్లరును, కుంగిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రాజెక్టు అంటే మేడిగడ్డ బ్యారేజీ ఒక్కటే కాదని.. వందల కిలోమీటర్ల మేర సొరంగాలు, కాలువలు, పంప్‌హౌజ్‌లు, బ్యారేజీల్లాంటి వంద అంకాలతో కూడుకున్న సాగు, తాగునీటి ప్రాజెక్టు అని వివరించారు. ఇంత పెద్ద ప్రాజెక్టులో ఒకటైన మేడిగడ్డ బ్యారేజీలో చిన్న సమస్య ఎర్పడితే పునరుద్ధరించాల్సి పోయి.. చిల్లర రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. 1.6కిలోమీటర్ల పొడవున్న బ్యారేజీలో 50మీటర్ల మేర సమస్య ఎర్పడితే దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భూతద్దంలో చూపిస్తూ, పనికిరాని ప్రాజెక్టు అని, రూ.లక్షకోట్లు నీటిపాలయ్యాయని ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లసాగర్ తదితర ప్రాజెక్టుల్లో లోపాలున్నా తామెప్పుడూ రాజకీయం చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాక మరమ్మతులు చేయించామన్నారు. ఇంజనీరింగ్ నిపుణులు బ్యారేజీ పునరుద్ధరణకు వీలుందని చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. వరదలు ప్రారంభం కాకముందే కాఫర్‌డ్యాం ఏర్పాటు చేసి పునరుద్ధరణ పనులు పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరితో కరీంనగర్ సహా పలు జిల్లాల్లో పంటలు ఎండుతున్నాయన్న కేటీఆర్ సాగునీటిని అందించి రైతులను ఆదుకోవాలన్నారు. అనంతరం సీనియర్ ఇంజనీరు దామోదర్ రెడ్డి మాట్లాడుతూ బ్యారేజీలో సమస్యను గుర్తించి మరమ్మతులు చేపడితే నీటిని నిల్వ చేసి రాష్ట్రానికి సాగునీరందించవచ్చన్నారు. బ్యారేజీలో వచ్చిన సమస్యను పరిష్కరించుకుని భవిష్యత్‌లో జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందన్నారు. మిగతా బ్యారేజీల్లోనూ సమస్యలుంటే వాటిని ముందుగానే గుర్తిస్తే సరిపోతుందన్న ఆయన 93మీ టర్ల వరకు నీటిలెవల్ ఉంచి నీటిని ఎగువకు పంపింగ్ చేసుకోవచ్చని తెలిపారు.



అన్నారం బ్యారేజీ వద్ద పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్న కడియం శ్రీహరి



మేడిగడ్డ బ్యారేజీ వంతెనపైకి వచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

అన్నారం బ్యారేజీ వద్ద పవర్‌పాయింట్ ప్రజంటేషన్

- కాంగ్రెస్ తీరుపై కడియం శ్రీహరి, హరీశ్‌రావు మండిపాటు

మేడిగడ్డ సందర్శన అనంతరం అన్నారం బ్యారేజీ వద్దకు చేరకున్న బీఆర్ఎస్ నేత బృందం అక్కడ ప్రాజెక్టు అవసరతతో పాటు మరమ్మతులు ఏమేరకు సాధ్యమో వివరించేందుకు పవర్‌పాయింట్ ప్రజెంటే షన్‌ను ఏర్పాటు చేసింది. మాజీ నీటిపారుదల శాఖ మంత్రి, బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఈ పీపీటీలో ప్రాజెక్టు సమగ్రస్వరూపాన్ని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన కడి యం, హరీశ్‌రావు తమ పాలనలో చేపట్టిన ప్రాజెక్టులపై కాంగ్రెస్ పార్టీ రాజకీయపరమైె దుర్బు ద్ధితో ఎంపీ ఎన్నికల్లో లబ్ధిపొందడమే లక్ష్యంగా తప్పుడు ప్రచారాలు చేస్తోందంటూ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బ్యారేజీ ఒక్కటే కాదని.. వంద కాంపోనెంట్ల సమాహారమని, ఇదో బృహత్తరమైన ప్రాజెక్టు అని పేర్కొన్నారు. మూడు బ్యారేజీలు, 15రిజర్వాయర్లు, 19సబ్‌స్టేషన్లు, 21పంప్‌హౌజ్‌లు, 203కిలోమీటర్ల నిడివిలో సొరంగాలు, 1531మీటర్ల మేర గ్రావిటీ కాలువలు, 98కిలోమీటర్ల మేర ప్రెజర్ మెయిన్స్, 141టీఎంసీల కెపాసిటీతో రిజర్వాయర్లు, 530మీటర్ల ఎత్తుకు నీటిని పంపింగ్ చేయడం లాంటి కాంపోనెంట్ల ద్వారా మొత్తం 240టీఎంసీల నీటిని వినియోగించుకునే లక్ష్యంతో కాళేశ్వరం ప్రాజెక్టును రీడిజైన్ చేసి నిర్మించినట్లు చెప్పుకొచ్చారు. అయితే కాంగ్రెస్ నేతలు ప్రాజెక్టులో దెబ్బతిన్న పిల్లర్లను మరమ్మతు చేయాల్సింది పోయి రాజకీయ దురుద్దేశాలతో దుష్ప్రచారం తో చేస్తూ ప్రాజెక్టును నిర్వీ ర్యం చేయడం ద్వారా రైతుల ప్రయోజనాలను దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారంటూ విరుచుకుపడ్డారు. చరిత్రలో అతి తక్కువ అంచనాలతో నిర్మాణం పూర్తయిన ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరమేనని గణాంకాలు వెల్లడించారు. అలాగే కేటీఆర్ మాట్లాడు తూ ప్రాజెక్టుపై విచారణ నిర్వహించి అవసరమైతే బాధ్యులపై చర్యలు తీసు కోవాలని శాసనసభ వేదికగా తాము ఇప్పటికే తే ల్చిచెప్పామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వా కం కారణంగా కరీంనగర్‌లో పంటలు ఎండిపోతు న్నాయన్నారు. ఇప్పటికైన యుద్ధప్రాతి పాదికన చ ర్యలు చేపట్టి వరదలు వచ్చేలోపు ప్రాజెక్టును పున రుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, పద్మదేవేందర్‌రెడ్డి,

మిగతా 7వ పేజీలో..



వినియోగదారులకు జీరో బిల్ ఇస్తున్న మంత్రి సురేఖ

ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతాం

- పేదల ఇళ్లలో వెలుగులు నింపడమే లక్ష్యం
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- భగత్‌సింగ్ నగర్‌లో గృహజ్యోతి పథకం ప్రారంభం

వరంగల్‌టౌన్, మార్చి 1: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని, ప్రజా పాలన అందిస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం వరంగల్‌లోని 19వ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో కలెక్టర్ ప్రావీణ్య, అధికారులతో కలిసి ఆమె గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంగళవారం ముఖ్యమంత్రి చేతుల మీదుగా గృహలక్ష్మి పథకం ప్రారంభమైందని, ఈ రోజు జిల్లా కేంద్రాల్లో మంత్రుల చేతుల మీదుగా ప్రారంభిస్తున్నామన్నారు. పేదల ఇళ్లలో వెలుగులు నింపాలనే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం కింద రూ.500కు వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నామన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో గృహజ్యోతి పథకం కింద 1.45లక్షల కుటుంబాలకు, మహాలక్ష్మి పథకం కింద 50వేల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికే ఈ పథకాలు వర్తిస్తాయని, ఇది నిరంతర ప్రక్రియని, దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గత ప్రభుత్వం ప్రజాధనాన్ని వృథా చేసిందే తప్ప ప్రజలకు చేసిందేమీలేదని, కాంగ్రెస్‌ను గెలిపించిన రెండో రోజే రెండు పథకాలను ప్రారంభించి ప్రజలకు చేరువయ్యేలా చేశామన్నారు. ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని, చిన్నచిన్న ఉద్యోగాలు చేసే మహిళలు బస్సు చార్జీలు తప్పడంతో సంతోషిస్తున్నారన్నారు. ఉచిత సౌకర్యంతో వైద్యం కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నారని, మేడారం జాతరకు లక్షలాది మంది మహిళలు బస్సుల్లో వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నాయని, పథకాలను కొద్ది రోజుల్లోనే బంద్ చేస్తారని బద్నాం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రాజెక్టుల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాధనం లూటీ చేయడం తప్పా, చేసిందేమీ లేదన్నారు.

కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్‌దాసు, ఎస్ఈ మధుసూదన్, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, నాయకులు గోపాల నవీన్‌రాజ్, నల్గొండ మేష్, మీసాల ప్రకాష్, దాసరి రాజేష్, కొత్తపల్లి శ్రీనివాస్, శామంతుల శ్రీనివాస్, కూచన రవీందర్, సిలువేరు శ్రీనివాస్, జంగం ప్రభాకర్ పాల్గొన్నారు.

విహంగ వినోదం!

అరుదైన పక్షుల ఆవాసం



- వివిధ దేశాల నుంచి వలస వస్తున్న అనేక పక్షులు
- పక్షుల విడిదికి అనువుగా అమ్మవారిపేట చెరువు
- పక్షుల సంరక్షణ కేంద్రంగా చేయాలని ప్రకృతి ప్రేమికుల డిమాండ్

7

రామ రాజ్యం కావాలా.. రాక్షస పాలన కావాలా?

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్
- కమలాపూర్‌లో కొనసాగిన ప్రజాహిత యాత్ర



కమలాపూర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

కమలాపూర్ (ఎల్కతుర్తి), మార్చి 1: భారత దేశం రామ రాజ్యంగా ఉండాలంటే దేశ ప్రధానిగా నరేంద్రమోదీనే కొనసాగాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో బండి సంజయ్ చేపట్టిన ప్రజా హిత యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా కమలాపూర్ మండల కేంద్రంలో మాట్లాడుతూ.. తెలంగాణలో కేసీఆర్ పాలన అంతమొందగా కాంగ్రెస్ రాక్షస పాలన సాగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 80 రోజుల్లోనే తెలంగాణకు రూ.10వేల కోట్ల అప్పులు చేసి చూపెట్టారని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రాక ముందే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు రేషన్ కార్డులు జారీ చేయకుండానే రేషన్ కార్డులు ఉన్న వారికే 6 గ్యారంటీలను అందిస్తామని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడం కాదా అని పశ్నించారు. సంక్షేమ పథకాల అమలు కోసం కేసీఆర్‌ను నిలదీస్తే తనపై 100 కేసులు పెట్టి 14 సార్లు జైలుకు పంపారని విమర్శించారు. కేసులకు బయపడే వ్యక్తిని కాదని, ప్రజల అభివృద్ధి కోసమే పాటు పడుతానన్నారు.

కేసీఆర్ పాలనలో కాళేశ్వరం ప్రాజెక్టు పరిశీలనకు బీజేపీ నాయకులు వెళితే పోలీసులతో కొట్టించారని.. ఇప్పుడు కేటీఆర్ అక్కడికి వెళ్లే ప్రయత్నం చేస్తే దాదాపు వారికి అదే గతి పట్టిందని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. టీఆర్ఎస్ - కాంగ్రెస్ పార్టీలు రెండు ఒక్కటేనన్నారు. కాళేశ్వరంపై లక్ష కోట్ల అవినీతి జరిగిందని రుజువైనా ఎందుకు కేసీఆర్‌పై కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుని ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని విమర్శించారు. దేశంలో మోదీ ప్రభుత్వం లేకుంటే దోపిడీకి అడ్డుకట్ట వేయడం సాధ్యం కాదన్నారు. ప్రపంచం మొత్తం దేశ ప్రధాని మోదీనే దేవుడిగా కొలుస్తున్నారన్నారు. తిరిగి మూడోసారి మోదీని ప్రధాన మంత్రిని చేసుకుని రామ రాజ్యాన్ని నెలకొలుపుదామన్నారు. అనంతరం బండి సంజయ్ ప్రజా హిత యాత్ర కరీంనగర్ జిల్లాలోకి ప్రవేశించింది. జమ్మికుంట మండలం ఇల్లంతకుంట మీదిగా వీణవంక మండల కేంద్రానికి చేరుకుంది. వీణవంకలో బండి సంజయ్ బస చేసి తిరిగి యాత్ర కొనసాగించనున్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సంగెం కళాశాలలో పరీక్షను తీరును పరిశీలిస్తున్న డీఐఈవో మాధవరావు

ఇంటర్ పరీక్షలకు 95శాతం హాజరు

వరంగల్ సిటీ, మార్చి 1: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. మూడో రోజు (శుక్రవారం)జరిగిన ఫస్టియర్ పరీక్షలో 95శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విభాగంలో 5,197 మంది విద్యార్థులకుగాను 4,954 మంది హాజరు కాగా, వొకేషనల్‌లో 1,153కుగాను 1,072 మంది మొత్తం 6,026 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 243 మంది గైర్హాజరు కాగా, వొకేషనల్ విభాగంలో 81మంది కలిపి మొత్తంగా 324 మంది గైర్హాజరయ్యారు. సంగెం, గీసుగొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను డీఐఈవో కాక మాధవరావు సందర్శించి, పరీక్ష జరుగుతున్న విధానాన్ని ఆయన పరిశీలించారు.

కొనసాగుతున్న మేడారం హుండీల లెక్కింపు

- రెండోరోజు రూ.2.98కోట్ల ఆదాయం రాక

హనుమకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీ పంలోని టీటీడీ కల్యాణ మండపంలో మేడారం సమ్మక్క- సారలమ్మ జాతర హుండీల లెక్కింపు శుక్రవారం రెండోరోజు ప్రశాం తంగా సాగింది. రెండో రోజు 71 హుండీలను లెక్కించగా రూ.2,98, 35,000 ఆదాయం వచ్చింది. దీంతో గురు వారం లెక్కించగా వచ్చిన రూ.3.15కోట్లతో కలుపుకొని మొత్తం ఆదాయం రూ.6,13,75,000 చేరుకు న్నది. ఈ రెండు రోజులు లెక్కించిన హుండీల సంఖ్య మొత్తం 205 చేరుకున్నది. రెండో రోజు లెక్కింపులోనూ కరెన్సీ నోట్లు, నాణాలు, బంగా రం, వెండి కానుకలతో పాటు విదేశీ కరెన్సీ పెద్ద మొత్తం బయట పడింది. వీటిని లెక్కించి బ్యాంకులో జమ చేశారు. భారీ బందోబస్తు మధ్య హుండీల లెక్కింపు జరుగుతోంది. నాణాలు, బియ్యం, వేరు చేసే మిషన్‌ను ఈసారి ప్రత్యే కంగా ఏర్పాటు చేయడం వల్ల లెక్కింపు వేగంగా జరుగుతోంది. దేవాదాయ శాఖ డీసీ శ్రీకాంతరావు, ఏసీ ఆర్.సునీత, ఈవో రాజేంద్రం లెక్కింపును పర్యవేక్షిస్తున్నారు. లెక్కింపు మరో నాలుగైదు రోజులు పట్టవచ్చు.



'పల్స్ పోలియో'కు సన్నద్ధం

- జిల్లాలో 75,277 మంది చిన్నారులు
- 456 టీమ్స్, 1824 మంది సిబ్బంది ఏర్పాటు
- అందుబాటులో ఆరు 108 వాహనాలు, 24 మొబైల్ టీమ్స్

వరంగల్ కలెక్టరేట్, మార్చి 1: చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయడానికి జిల్లా అధికారుల సమాయత్తమయ్యారు. ప్రతీ ఏటా రెండుసార్లు చిన్నారులు వేసే పోలియో చుక్కలను రేపటి నుంచి జిల్లా వ్యాప్తంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంపై కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులు, సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు అందించారు. జిల్లా వ్యాప్తంగా 75,277 మంది 0.5 నుంచి 5 సంవత్సరాల వయసు వరకు చిన్నారులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. 3న ఏర్పాటు చేసిన కేంద్రాల్లో, 4, 5న ఇంటింటికి తిరిగి చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయనున్నారు. కాగా, పల్స్‌పోలియో నిర్వహణకు 456 టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ టీమ్‌లలో 1,824 మంది సిబ్బందిని నియమించారు. ఇందులో ఏఎన్‌ఎంలు 276, ఆశాలు 666, అంగన్‌వాడీలు 992 మందికి విధులు కేటాయించారు. అలాగే 108 వాహనాలు ఆరు, మొబైల్ వాహనాలు 24 ఏర్పాటు చేశారు. జిల్లాలోని రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్ల, ప్రధాన ప్రాంగణాల్లో మరో 13సెంటర్లతోపాటు 46 మంది సూపర్‌వైజర్లను ఏర్పాటు చేశారు. కాగా, పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్‌హెల్త్ సెంటర్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఎంజీఎం ఆస్పత్రి, సీకేఎం ఆస్పత్రి, ఉర్సు ఆస్పత్రి, నర్సంపేట, వర్ధన్నపేట ఆస్పత్రులతోపాటు జిల్లా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కూడా పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



కానరాని ప్రచారం..

పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రతీ ఏటా ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మార్చి 3న జరిగే పల్స్ పోలియో కార్యక్రమానికి జిల్లాలో ఒక బ్యానర్ లేదు. వాల్ పోస్టర్ లేదు. అవగాహన కరపత్రాలు కూడా లేవు. తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడు రోజులపాటు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించే షెడ్యూల్ కలెక్టర్ తెలిపారు. ఈనెల 1 నుంచి 5వ తేది వరకు అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో విద్యుత్ కోత లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలి..

- జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మార్చి 1: జిల్లాలోని చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలు వేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య కోరారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పల్స్ పోలియో ఇమ్యూనేషన్ ప్రోగ్రాంపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో మూడు నుంచి ఐదు వరకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లాలోని ప్రతీ ఇంటిలో చెక్ చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. హై రిస్క్ ప్రాంతాలను గుర్తించి వందశాతం పిల్లలకు చుక్కలు వేయాలన్నారు. ఈనెల 1 నుంచి 5 వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎలాంటి విద్యుత్ కోత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. బస్ స్టేషన్, రైల్వే స్టేషన్‌లలో ప్రతీ పది నిమిషాలకోసారి అనౌన్స్ చేయాలని కలెక్టర్ అన్నారు. సమావేశంలో వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటరమణ, డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ ప్రకాష్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్‌డీవో పీడీ కౌసల్యాదేవి, డీడబ్ల్యూవో శారద, మెప్మా అధికారి రేణుక, ఆర్టీసీ అధికారి లక్ష్మి, మునిసిపల్ కమిషనర్లు, విద్యుత్ శాఖ అధికారులు, డెమో అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

ప్రజాపాలన సేవా కేంద్రాలను నెలకొల్పాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

వరంగల్ కలెక్టరేట్, మర్చి 1: ప్రభుత్వం అభయ హస్తం కింద అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అర్హులైన ప్రతీ ఒక్కరికి లబ్ధి చేకూరేలా కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ద్వారా అర్హత కలిగిన వారందరు ప్రయోజనం పొందేలా ఎస్పీడీవో కార్యాయాలు, మునిసిపల్ వార్డులు, ఆఫీసుల్లో సత్వరమే ప్రజాపాలన సేవా కేంద్రాలను నెలకొల్పాలని ఆదేశించారు. డీజీపీ రవిగుప్తాతో కలిసి శుక్రవారం చీఫ్ సెక్రటరి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా దరఖాస్తులు చేసుకోలేకపోయిన అర్హులైన వారితోపాటు దరఖా స్తుల్లో సరియైన వివరాలు నమోదు చేయని వారి కోసం ప్రజాపాలన సేవా కేంద్రాలను యుద్ధ ప్రతిపాధికన ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కేంద్రాలు శాశ్వత ప్రాతిపాదికన పనిచేసే అవకాశం ఉన్నందున ఇంటర్నెట్ సదుపా యంతో కూడిన కంప్యూటర్ ఏర్పాటు చేస్తూ డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియ మించాలన్నారు. సోమవారం నాటికి అన్ని చోట్ల సేవా కేంద్రాలు అందుబా టులోకి వచ్చి పనితీరు ప్రారంభం కావాలన్నారు. .

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..

ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షలతో పాటు త్వరలో ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్ శాంతికుమారి సూచించారు. సెల్‌ఫోన్లను అమతించకుండా, మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా బందోబస్తుతో ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్‌తోపాటు డీసీపీ రవీందర్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, ఇంటర్మీడియేట్ అధికారి మహేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రంగనాథస్వామిపై సూర్యకిరణాలు



వరంగల్‌టౌన్, మార్చి 1: కాశిబుగ్గ శ్రీరంగనాథస్వామి దేవాలయంలో శుక్రవా రం ఉదయం ఆరుగంటకు స్వామివారిపై సూర్యకిరణాలు పడ్డాయి. ఈ సంద ర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం ఫిబ్ర వరి చివరలో లేదా మార్చి మొదటి రోజులో ఒకరోజు రంగనాథ స్వామి వారిపై సూర్యకిరణాలు పడుతాయని, ఆ సమయంలో స్వామిని దర్శించుకుంటే మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల క్రిష్ణమా చార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జడ్పీ వ్యవస్థ నిర్వీర్యం

నిధుల మంజూరులో కోత ● అరకొర నిధులతో పనులు చేయని దుస్థితి
కార్యాలయ నిర్వహణకు డబ్బులు కరువు ● ఉత్సవ విగ్రహాలుగా జడ్పీటీసీలు

హనుమకొండ టౌన్, మార్చి 1: గత పాలకులు జడ్పీ సెక్టార్‌ను నిర్వీ ర్యం చేశారు. మినీ అసెంబ్లీగా పిలవబడే జడ్పీ సెక్టార్‌కు నిధుల మంజూరులో కోత విధించారు. పలు గ్రాంట్లను నిలిపివేసి అరకొర నిధులు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారు. అభివృద్ధి పనులు దేవుడెరుగు కనీసం చాయి, బిస్కెట్లకు నిధులు లేని దుస్థితి జడ్పీ సెక్టార్‌లో నెలకొంది. ప్రత్యక్ష ఎన్నికల్లో విజయం సాధించి ఉత్సాహంగా జడ్పీలో అడుగుపెట్టిన జడ్పీటీసీలు ఉత్సవ విగ్రహాలుగా మారారు. కేవలం మీటింగ్‌లకు రావడం, వారు కొనసాగుతున్న పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడం మినహా వారు చేసే ఘనకార్యం ఏమిలేదు. మరో నాలుగుమాసాల్లో పదవీకాలం పూర్తి కావస్తుండగా గెలిపించిన ప్రజల కోసం పైసా పని చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీనితో జడ్పీటీసీలు ప్రజలకు ముఖం చాటేయాల్సిన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుండటం గమనార్హం. నూతన ప్రభుత్వం ఈ పరిస్థితిని గమనించి జడ్పీలకు పూర్వవైభవం తీసుకురావాలని సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అరకొర నిధులు మంజూరు

జడ్పీ సెక్టార్‌లకు గత పాలకులు అరకొర నిధులు మంజూరు చేశారు. 2019 జూలై మొదటి వారంలో జడ్పీ పాలకవర్గాలు కొలువుదీరాయి. ఈ ఐదేళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేవలం రూ.5కోట్ల 83లక్షల 22వేల నిధులు మంజూరయ్యాయి. వీటిలో కేంద్రం మంజూరు చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2కోట్ల 78లక్షల 39వేలు కాగా, రాష్ట్రం స్పెషల్ గ్రాంట్ క్రింద మంజూరు చేసిన నిధులు రూ.3కోట్ల 48లక్షలు. ఈనిధులు జిల్లాలోని ఏడుగురు జడ్పీటీసీలు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులకు కేటాయిస్తారు. కాగా, వచ్చిన నిధులు 60:40 రేషియోలో పంపకాలు జరుపుకున్నట్లు సమాచారం. 60శాతం 8మంది సభ్యులకు 40శాతం చైర్మన్ కోటా కింద కేటాయింపులు జరుపుకున్నట్లు తెలిసింది. చైర్మన్‌కు కేటాయించిన అదనపు నిధులు అత్యవసరమైన చోట వెచ్చించేందుకు వినియోగిస్తున్నట్లు సమాచారం. ఈ లెక్కన ప్రతి జడ్పీటీసీకి వచ్చిన గ్రాంట్ కేవలం రూ.60 లక్షలు మించలేదు. ప్రతీ జడ్పీటీసీ పరిధిలో 20కి పైగా గ్రామాలుంటాయి. వచ్చిన గ్రాంట్ సమానంగా పంపకాలు జరిపితే ప్రతీ గ్రామానికి రూ.3లక్షల నిధులు మాత్రమే వస్తాయి. అరకొర నిధులతో ఎలాంటి పనిచేయలేని జడ్పీటీసీలు ఒకటిరెండు గ్రామాలు ఎంపిక చేసుకుని అందుబాటులో నిధులమేరకు అభివృద్ధి పనులు చేశారు. మిగతా గ్రామాలను గాలికి వదిలేసారు.

చాయ్, బిస్కెట్లకు డబ్బులు లేవు

పాలకులు జడ్పీ సెక్టార్‌లకు నిధులు మంజూరు చేయకపోవడంతో కనీస సౌకర్యాలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జడ్పీలకు మంజూరయ్యే నిధుల నుంచి 5శాతం నిధులు పరిపాలన సంబంధ ఖర్చులకు వెచ్చిస్తున్నారు. సమావేశాలు జరిగినప్పుడు చాయ్, బిస్కెట్లు, స్టేషనరీ, స్వీపర్లకు వేతనాలకు, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారు. నిధుల మంజూరులో కోత ఏర్పడటంతో యేడాదిగా కరెంటు బిల్లులు చెల్లించడం లేదు. దినసరి ఉద్యోగులకు రెండు మూడు నెలలకు వేతనాలు ఇస్తున్నారు. జడ్పీ కార్యాలయం మెయిన్ రోడ్డు ఆరు కమర్షియల్ కాంప్లెక్స్ ఉండటం, వాటి అద్దెలతో ఖర్చులు కానిస్తున్నారు. మొత్తంగా గతపాలకుల వైఖరితో మినీ అసెంబ్లీగా పిలువబడే జడ్పీ సెక్టార్‌లు ఉనికిని కోల్పోయే దుస్థితి నెలకొనడం విశేషం.

మంజూరైన నిధులు ఇలా..

15వ ఆర్థిక సంఘం నిధులు: 2020-21 సంవత్సరానికి గాను రూ.57,87,000

2021-22 సంవత్సరానికి గాను రూ.93,80,464

2022-23 సంవత్సరానికి గాను రూ.97,24,102

2023-24 సంవత్సరానికి గాను రూ.29,47,730

స్పెషల్ గ్రాంట్: 2021 సంవత్సరానికి గాను రూ.1,73,00,663

స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్: 2022-23 సంవత్సరానికి గాను రూ.1,31,82,907..

అల్లంత దూరం నుంచి పక్షులను చూడడం, చెట్లపై వాలిన వాటి అందాలను దూరంగా గమనించడం సహజం. అవే పక్షులను దగ్గరగా చూస్తే? వాటి ఆహారం, ఆహార్యం, అలవాట్లను తెలుసుకోగలిగితే..? చింత రావి, తుమ్మ, గంద్ర వెదురు చెట్లపై వాలే ఈ అతిథి విహంగ జీవన క్రమాన్ని అర్థం చేసుకోగలిగితే.. ఎంత బాగుంటో దో కదా.. ఈ సరదా తీరాలంటే వరంగల్‌లోని అమ్మవారిపేట చెరువు వద్దకు వెళితే సరి. ఆహారం, అన్వేషణ, అవాసాలపై జీవించే క్రమంలో ఆయా పక్షుల ప్రత్యేకతను వివరంగా తెలుసుకునే అవకాశం ఈ చెరువు వద్ద కనిపిస్తుంది. పక్షులు కిలకిలరావాలు చెవులకు ఇంపుగా వినిపిస్తాయి. మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి.



అరుదైన పక్షుల ఆలవాలం

- వివిధ దేశాల నుంచి వలస వస్తున్న అనేక పక్షులు
- అమ్మవారిపేట చెరువు వద్ద పక్షుల విడిదిగా అనువైన వాతావరణం
- పక్షుల సంరక్షణ కేంద్రంగా చేయాలని ప్రకృతిప్రేమికుల డిమాండ్

హనుమకొండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర శివార్లలోని అమ్మవారిపేట ప్రకృతి రమణీయతకు ప్రతీక. చెరువుకు రెండు వైపుల గుట్టలు. మరో వైపు పొలాలు, ఇంకో వైపు నిండుగా నీళ్లతో చెరువు. దాని ఆవరించిన కట్ట. ఎటుచూసినా పచ్చని చెట్లు. నిశ్శబ్దమైన వాతావరణం. చెట్లపై వివిధ రకాల అరుదైన పక్షుల కిలకిలలు, స్థానికంగా ఉండే పక్షులతోపాటు వివిధ దేశాల నుంచి వలస వచ్చిన పక్షులు ఇక్కడ విడిది చేసి ఉండడం కనిపిస్తుంది. సుమారు 100 రకాలు ఇక్కడ దర్శనమిస్తాయి. వీటిలో అత్యంత అరుదైన పక్షులు కూడా ఉన్నాయి. ఇటీవల జంతుశాస్త్ర ప్రొఫెసర్ డాక్టర్ జగన్ ఓ అరుదైన పక్షిని గుర్తించి ఫొటోలు తీశారు. ఇలాంటివే మరికొన్ని పక్షులు కూడా అక్కడ ఉన్నాయి. సాధారణంగా ఆయా కాలాల్లో వివిధ ప్రాంతాల నుంచి పక్షులు గుడ్లను పొదగడం కోసం అనువైన ప్రాంతాలను వెతుక్కుంటూ వలస వెళుతుంటాయి. అలాంటి ప్రాంతమే అమ్మవారిపేట చెరువు. పచ్చని చెట్లు, మనసుకు హాయినిచ్చే ప్రశాంతతకు పెట్టింది పేరు ఈ చెరువు. అనువైన వాతావరణం ఉండడంతో అనేక పక్షులు ఇక్కడికి పెద్దఎత్తున వలస వస్తున్నాయి.

అరుదైన పక్షి

ఇటీవల అత్యంత అరుదైన పక్షి స్పర్ వింగ్డ్-లాప్ వింగ్ అనే పక్షి అమ్మవారిపేట చెరువు వద్ద కంటపడింది. దేశంలో మొట్టమొదటి సారి ఇక్కడే కనిపించడం విశేషం. ఈపక్షి స్వస్థలం ఉత్తర ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, మధ్యదరా ప్రాంతాలు. సాధారణగా ఏ పక్షి రెక్కలకు గోళ్లు ఉండవు. కానీ అరుదైన పక్షి రెక్కలకు గోళ్లు ఉన్నాయి. చిన్నగా, పొట్టిగా ఉండి చూడడానికి చాలా అందంగా కనిపిస్తుంది. ఈ పక్షిని మొట్టమొదటిసారిగా హనుమకొండకు చెందిన జువాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జగన్ గుర్తించారు. పక్షి ఫొటోలను తీశారు. ఇలాంటివే మరికొన్ని పక్షులు కూడా ఇక్కడ సంచరిస్తున్నాయి. ఆయన వాటిని కూడా గుర్తించే ప్రయత్నంలో ఉన్నారు. దీనిని బట్టి సుదూర దేశాల నుంచి పక్షులు ఈ చెరువు వద్దకు వలస వస్తున్నట్టు స్పష్టమవుతోంది.

వంద రకాల పక్షులు

అమ్మవారిపేట చెరువు వద్ద 100 రకాల పక్షులు సంచరిస్తున్నాయి. వీటిలో స్థానికంగా కనిపించే పక్షులతో పాటు ఇతర దేశాలకు చెందిన అరుదైన, అందమైన పక్షులు కూడా ఉన్నాయి. వేర్ టేయిల్డ్ స్వాలో, బ్లూటేల్డ్ బీ ఈటర్, యూరోసియన్ వేగన్, కామన్ వ్యాగ్ టేయిల్, విష్కర్డ్ టెర్న్స్, బ్లాక్ వింగ్డ్ స్టిల్ట్స్, వైట్ త్రోటెడ్ కింగ్ ఫిషర్, ఎల్లో రాటిల్డ్ లాప్వింగ్, ఎల్లో వ్యాగ్‌టేల్, ఇంటర్మీడియట్ ఎగ్రెట్, స్పాట్ బిల్ః డక్, కామన్ డ్రాంగో, కామన్ ప్రైనియా, సాండ్ పైపర్, డార్టర్ ద స్నేక్ బర్డ్, గ్రే హేరాన్, గ్రీన్ బీ ఈటర్, ఫ్రింగ్కీ ఊలీడక్స్, నాబ్ బిల్డ్ డక్స్, బిన్ టెల్, గార్గని, యురేపియన్ బీగన్, టఫెడ్ డక్స్, తదితర పక్షులు వీటిలో ఉన్నాయి. కామన్ కింగ్ ఫిషర్, రీడ్ వెబ్లెర్, సిల్వర్ బిల్, ఫెల్‌వోస్ విజిలింగ్ డక్స్ వంటి పక్షులు కూడా వీటిలో ఉన్నాయి.


పక్షుల సంరక్షణ కేంద్రం

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అమ్మవారిపేట చెరువు వద్ద అనేక రకా పక్షులు విడిది చేస్తున్నందువల్ల ఈ చెరువును పక్షుల సంరక్షణ కేంద్రంగా మార్చాలని స్థానికులు, పక్షి ప్రేమికులు కోరుతున్నారు. హైదరాబాద్‌లోని అమీన్‌పూర్ చెరువు తర్వాత అత్యధిక సంఖ్యలో వివిధ రకాల పక్షులకు కేంద్రంగా ఉన్న అమ్మవారి పేట చెరువును పక్షుల సంరక్షణ కేంద్రంగా ప్రకటించినట్లయితే మరిన్ని ఎక్కువ పక్షులు ఇక్కడి వచ్చే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు. వాస్తవానికి వరంగల్ నగరం, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో పలుచెరువు ఉన్నాయి. ఈ చెరువుల వద్ద కూడా అనేక రకాల పక్షులు మనకు తారసడతాయి. అయితే కబ్జాల కారణంగా ఈ చెరువులన్నీ క్రమంగా కనుమరుగవుతున్నాయి. దీనితో వరంగల్‌లో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. పక్షులన్నీ ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నాయి. అలా కాకుండా కనీసం అమ్మవారి చెరువునా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పక్షి ప్రేమికుడు డాక్టర్ జగన్

డాక్టర్ జగన్ పక్షి ప్రేమికుడు. ఏళ్లతరబడి పక్షులపై ఆయన అధ్యయనం చేస్తున్నారు. ఇప్పటికే ఆయన వందర రకాల పక్షులపై లోతైన అధ్యయనం చేశారు. వాటి ఫోటోలను తీసి అల్బమ్‌గా తీసుకువచ్చారు. అమ్మవారిపేట చెరువు వద్ద అరుదైన స్పర్డ్ వింగడ్-ల్యాప్ వింగ్ పక్షిని మొట్టమొదటి సారి గుర్తించింది ఆయనే. జనగామ జిల్లా పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన డాక్టర్ జగన్ 2005నుంచి పక్షలపై అధ్యయనం చేస్తున్నారు. ఉద్యోగరిత్యా హైదరాబాద్‌లో ఉన్నప్పుడు అమీన్‌పూర్ చెరువు, దానిచుట్టుపక్కల ఉన్న పలు అరుదైన పక్షలను గుర్తించారు. వరంగల్ దాని చుట్టుపక్కల ఉన్న చెరువుల వద్ద అనేక రకాల పక్షలు కనిపిస్తాయని అంటున్న ఆయన చెరువులు అంతరించిపోతుండడం వల్ల ఈ పక్షుల ఉనికి ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


కామన్ పేలియా


గ్రీన్ బీటర్


ఎల్లో వ్యాగ్‌టేయిల్


ఇంటర్మీడియట్ ఎగ్రెట్


సాండ్ పైపర్


డార్టర్ ది స్నేక్ బర్డ్


గ్రే హెరాన్


కామన్ డ్రాగన్


స్పాట్ బిల్ డక్

నకిలీ సెఫిక్సిన్ విక్రయించొద్దు..

హనుమకొండ, మార్చి 1: నకిలీ సెఫిక్సిన్‌ను మార్కెట్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హనుమకొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జన్ను కిరణ్ కుమార్ హెచ్చరించారు. హైదరాబాద్‌లో నకిలీవిక్రయాలపై ఔషధ నియంత్రణ శాఖ డైరెక్టర్ జనరల్ కమల్‌హాసన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఔషధ నియంత్రణ శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం విచారణ చేపట్టిందన్నారు. హైదరాబాద్‌లో ఈ నకిలీ మందు విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, పసిగట్టి దాడులు చేపట్టామన్నారు. వీటి మూలాలు ఉత్తరాఖండ్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడడకు వెళ్లి స్థానిక పోలీసుల సహకారంతో వారిని అరెస్టు కూడా చేశామన్నారు. హనుమకొండలో ఇలాంటి నకిలీ విక్ర యాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పది మందికి జరిమానా

హనుమకొండ క్రైం, మార్చి 1: డ్రంకెన్ డ్రైవ్‌లో పది మందికి జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా న్యాయస్థానం శుక్రవారం తీర్పు వెల్లడించింది. హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేయూ జంక్షన్, పెద్దమ్మగడ్డ, నయీంనగర్, యాదవనగర్‌లో గురువారం రాత్రి పది మందిని అదుపులోకి తీసుకుని బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా మద్యం సేవించినట్టు గుర్తించారు. వారికి శుక్రవారం కోర్టుకు తరలించగా న్యాయమూర్తి రమేష్ పది మందికి రూ.10,700 జరిమానా విధించారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 7 గురు వ్యక్తులకు రూ.7,900 జరిమాన విధించినట్టు సీతారెడ్డి తెలిపారు.

వలంటీర్ల ఎంపిక

హనుమకొండ క్రైం, మార్చి 1: అగ్నిమాపక శాఖకు అనుబంధంగా ప్రకృతి వైపరిత్యాలు సంభవించిన సమయంలో స్వచ్ఛందంగా పని చేసేందుకు వలంటీర్లను ఎంపిక చేస్తున్నట్టు అగ్నిమాపక శాఖ ఉమ్మడి వరంగల్ జిల్లా డివిజన్ అధికాధి మామిడి భగవాన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు 'ఆపద మిత్రుడు - స్వచ్ఛంద సేవకుడు' కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా నుంచి 200 మందిని, హనుమకొండ జిల్లా నుంచి 300 మందిని ఎంపిక చేస్తామని వెల్లడించారు. ప్రకృతి వైపరిత్యాలైన అగ్నిప్రమాదాలు, భూకంపాలు, వరదలు, తుపాన్లు వచ్చిన ప్రాంతాల్లో స్వచ్ఛందంగా పని చేస్తూ ప్రజలకు సేవ చేయాలనే మానవత్వం ఉన్న వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. రెండు జిల్లాల కలెక్టర్ల ఉత్తర్వుల మేరకు ఈనెల 4నుంచి ఎంపికల ప్రక్రియ జరుగుతుందని, 18 నుంచి 40 యేళ్లలోపు వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కనీసం 7వ తరగతి చదివి సేవాభావం కలిగి ఉన్న వారు అర్హులని వెల్లడించారు. ఎంపిక చేసిన వారికి 12 రోజుల ప్రత్యేక సామగ్రిని అప్పగించి శిక్షణ ఇస్తామని తెలిపారు. అన్ని అగ్నిమాపక కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు 87126 99149, 87126 99305 నెంబర్లలో సంప్రదించాలని భగవాన్‌రెడ్డి సూచించారు.

ఫోన్ లాక్కుని డబ్బు స్వాహా

హనుమకొండ క్రైం, మార్చి 1: బలవంతంగా ఫోన్ తీసుకుని ఫోన్‌లో నుంచి డబ్బులు కాజేసిన వ్యక్తిపై హనుమకొండ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఊకంటి శ్రీనాథ్‌రెడ్డి టైలర్‌స్ట్రీట్‌లో మెడికల్‌షాపులో పని చేస్తున్నాడు. హనుమకొండ సుధానగర్ ప్రాంతానికి చెందిన అనిపర్తి అనితకుమార్ అనే వ్యక్తి కొద్ది రోజుల కిందట పరిచయమయ్యాడు. కిందటేడు ఆగస్టు 28న శ్రీనాథ్‌రెడ్డి పనిచేస్తున్న మెడికల్ షాపునకు అనితకుమార్ వచ్చాడు. ఫోన్ మాట్లాడేది ఉంది, ఫోన్ ఇవ్వాలని కోరాడు. ఫోన్ ఇవ్వడానికి నిరాకరించడంతో బలవంతంగా ఫోన్‌ను లాక్కుని ఓ లోన్ యాప్ ద్వారా రూ.2.30లక్షలు అనిత్‌కుమార్ ఫోన్‌పేకు పంపించుకున్నాడు. డబ్బుల గురించి ప్రశ్నించగా ఇస్తానని జరుపుకుంటూ వచ్చి చివరికి ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకో అని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితుడు శ్రీనాథ్‌రెడ్డి హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో.. పంటలు ఎండుతున్నాయి


టోల్‌గేట్ వద్ద బీఆర్ఎస్ నాయకుల కాన్వాయ్‌ని అడ్డుకున్న కాంగ్రెస్ శ్రేణులు

(5వ పేజీ తరువాయి)

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, జడ్పీ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల సమన్వయలోపంతో ఉద్రిక్తత

బీఆర్ఎస్ చలో మేడిగడ్డ కార్యక్రమ నేపథ్యంలో పోలీసుల సమన్వయలోపం స్పష్టంగా కనిపించింది. తొలుత బ్యారేజీ చెక్‌పోస్ట్ వద్ద బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను లోనికి అనుమతించిన పోలీసులు కేటీఆర్ పర్యటనకు కొద్ది నిమిషాల ముందు కట్టడి చర్యలు ప్రారంభించారు. అప్పటికే వంతెన సమీపంలోకి చేరుకున్న కార్యకర్తలను పోలీసులు ఆపేందుకు ప్రయత్నించినా వారంతా వంతెన గేటు వద్దకు చేరుకోవడంతో పోలీసులు వంతెన గేటు మూసివేశారు. దీంతో పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తలకు మధ్య సుమారు అరగంటపాటు వాగ్వాదం జరిగింది. కానీ అక్కడ సరిపడా పోలీసు సిబ్బంది లేకపోవడంతో.. కార్యకర్తలంతా ఒక్కసారిగా గేటును తోసేసి లోనికి దూసుకురావడంతో స్వల్ప తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో పలువురు మహిళ కార్యకర్తలు, నాయకులు, పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనకు ముందు ఓడీఎస్పీ స్థాయి అధికారి మీడియాకు అనుమతి ఉందని లోపలికి పంపగా.. మరో డీఎస్పీ స్థాయి అధికారి అడ్డుకోవడం వాగ్వాదానికి దారితీసింది. పోలీసుల సమన్వయలోపాన్ని బయటపెట్టింది. ఇక పోలీసులు అత్యుత్సాహం కారణంగా కేటీఆర్‌తో కలిసి పరిశీలనకు వెళ్లాల్సిన మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రా రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మదేవేందర్‌రెడ్డిపాటు ఎంపీ మాలోత్ కవిత, జడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి సహా పలువురు నేతలు ప్రత్యేక వాహనాల్లో కాకుండా నడుచుకుంటూ కుంగిన ప్రాంతానికి వెళ్లారు. మూడు రోజుల ముందే పర్యటనకు సంబంధించిన సమాచారం ఉన్నా ఆస్థాయిలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేయలేదన్న విమర్శలు వినిపించాయి.

ఉద్రిక్తత.. ఉద్విగ్నంగా..

బీఆర్ఎస్ చేపట్టిన చలో మేడిగడ్డ కార్యక్రమం ఉద్రిక్తతగా సాగింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్ తెలంగాణ భవన్ నుంచి రెండు బస్సులతో పాటు కాన్వాయ్‌లో వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రులు, హరీ‌ష్‌రావు, నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మల్లారెడ్డి, మాజీస్పీకర్లు పోచారం శ్రీనివాస్ రెడ్డి, మదుసూధనచారి, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల బృందానికి జనగామ జిల్లా పెంబర్తి వద్ద స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రులు ఎరబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌లతో పాటు పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఉదయం 11 గంటలకు పెంబర్తి నుంచి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులకు హసన్‌పర్తి మండలం దేవన్నపేట వద్ద కాంగ్రెస్ శ్రేణుల నుంచి నిరసన ఎదురైంది. 'గో బ్యాక్ బీఆర్ఎస్.. గో బ్యాగ్ కేటీఆర్' అంటూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నినాదాలు చేసి బీఆర్ఎస్ నేతల కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. ఆ తర్వాత పోలీసుల బందోబస్తు మధ్య కాన్వాయ్ ముందుకు సాగింది. దామెర క్రాస్ వద్ద ఓ ప్రైవేటు ఆసుపత్రిలో పోలీసుల చేతిలో గాయపడి చికిత్స పొందుతున్న కార్యర్తలను కేటీఆర్ పరామర్శించారు. అక్కడి నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయానికి చేరుకున్న కేటీఆర్ బృందం మధ్యాహ్నం భోజనం అనంతరం 3:30గంటలకు భూపాలపల్లికి బయలుదేరి 4:40కి మేడిగడ్డకు చేరుకున్నారు. అక్కడ పరిశీలన అనంతరం 5.20గంటలకు అన్నారం బ్యారేజీకి వెళ్లారు.

బీఆర్ఎస్ నాయకుల అత్యుత్సాహం

పిల్లర్ల పైకి ఎక్కి సెల్ఫీలు

మహదేవపూర్ రూరల్, మార్చి 1: మేడిగడ్డ బ్యారేజీ వద్ద పోలీసులు పట్టించుకోకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రమాదకర ప్రదేశంలో సెల్ఫీలు దిగుతూ కనిపించారు. తొలుత మేడిగడ్డ బ్యారేజీ వంతెనపైకి అనుమతించని పోలీసులు ఆ తర్వాత కార్యకర్తలు నెట్టుకుంటూ రావడంతో వారిని వదిలేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు బ్యారేజీ వంతెనపైనే కాకుండా పిల్లర్లపైకి ఎక్కి సెల్ఫీలు దిగారు. సాధారణంగా అధికారులకు మాత్రమే అనుమతి ఉన్నచోట హంగామా చేశారు. ఇంత జరుగుతున్నా పోలీసులు కనీసం హెచ్చరికలు కూడా జారీ చేయలేదు.


మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్‌పైకి ఎక్కి సెల్ఫీలు దిగుతున్న బీఆర్ఎస్ నాయకులు

గెలుపే లక్ష్యంగా..

- కబడ్డీ పోటీలలో స్వర్ణ పతకమే లక్ష్యంగా కసరత్తు
- నేటి నుంచి నాగార్జునసాగర్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు


జేఎన్ఎస్ కబడ్డీ కోర్టులో సాధన చేస్తున్న హనుమకొండ జిల్లా కబడ్డీ జట్టు క్రీడాకారులు

హనుమకొండ స్పోర్ట్స్, మార్చి 1: మార్చి 2 నుంచి 4 వరకు నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లో నిర్వహించనున్న 70వ అంతర్ రాష్ట్రాల సీనియర్ మెన్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో పాల్గొని స్వర్ణ పతకం సాధించి జిల్లాకు కీర్తి తీసుకరావడమే ధ్యేయంగా హనుమకొండ జిల్లా కబడ్డీ జట్టు క్రీడాకారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన జట్టు క్రీడాకారులు కొంత కాలంగా హనుమకొండ జేఎన్ఎస్‌లోని కబడ్డీ కోర్టులో డీఎస్ఏ తాత్కాలిక కోచ్ ఓనపాకల శంకర్ సారథ్యంలో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో సాధన చేస్తున్నారు. డీఎస్ఏ కోచ్ శంకర్ సారథ్యంలో శిక్షణ పొందుతున్న జిల్లా జట్టు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలలో సత్తా చాటి స్వర్ణ పతకం సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కబడ్డీ అకాడమీ ఏర్పాటు చేయాలి.. : ఓనపాకల శంకర్, డీఎస్ఏ కబడ్డీ కోచ్

జేఎన్ఎస్‌లో కొన్ని క్రీడలకు మాత్రమే అకాడమీలు ఉన్నాయి. గ్రామీణ క్రీడగా ప్రసిద్ధిగాంచిన కబడ్డీ క్రీడాకారులు కోసం అకాడమీ ఏర్పాటు చేయడం ద్వారా మెరికలాంటి క్రీడాకారులను జిల్లాకు అందించవచ్చు. అకాడమీలు నెలకొల్పడం ద్వారా క్రీడాకారులకు మరిన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండడంతో క్రీడల్లో మరింత నైపుణ్యం సాధించవచ్చు. అదే విధంగా కబడ్డీ క్రీడను ఒలంపిక్‌లో చేర్చడం ద్వారా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ లభించే అవకాశం ఉంది. ప్రతీ రోజు సుమారు 30 మంది యువతకు కబడ్డీ క్రీడలో ఉదయం, సాయత్రం వేళల్లో శిక్షణ అందిస్తున్న. ఇక్కడ నా వద్ద శిక్షణ పొందిన క్రీడాకారులు ఇప్పటికే పలు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి కబడ్డీ పోటీలో పాల్గొని ప్రతిభ కనబర్చి రాణిస్తున్నారు.

గ్రేట్ 'జాబ్'!

- అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టుల్లో అరుదైన ఫలితాలు
- ఒక్కరికి పలు ఉద్యోగాలు

● ఒకే మహిళకు నాలుగు ఉద్యోగాలు


గట్ల పుష్పలత


కేసముద్రం, మార్చి 1 : కేసముద్రం స్టేషన్‌కు చెందిన గట్ల పుష్పలత తెలంగాణ గురుకుల విద్యాసంస్థల నియామక బోర్డు(ట్రిబ్) ఆధ్వర్యంలో నిర్వహించిన నియామక పరీక్షల్లో నాలుగు ఉద్యోగాలకు ఎంపిక కావడం విశేషం. ఈ నియామక పరీక్షల్లో డిగ్రీ, జూనియర్ లెక్చరర్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ), ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ) పోస్టులకు ఆమె ఎంపికయ్యారు. కేసముద్రం స్టేషన్‌కు చెందిన స్థానిక జీజేసీ లెక్చరర్ కొత్తకొండ ప్రసాద్‌తో 2009లో వివాహం కాగా, అప్పటికే ఆమె బీఎస్సీ(బీజెడ్సీ), బీఈడీ పూర్తి చేశారు. వివాహం అనంతరం ఆమె భర్త ప్రోత్సాహంతో 2013లో ఎంఎస్సీ(బాటనీ), 2019లో ఎంఏ(తెలుగు) కేయూలో పూర్తిచేసి, జాతీయ అర్హత పరీక్ష(నెట్), రాష్ట్ర అర్హత పరీక్ష(సెట్) అర్హత సాధించారు. 2021లో నియామక పరీక్ష, డెమో, ఇంటర్వ్యూలో గెస్ట్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె వరంగల్ తూర్పు టీఎస్ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు గెస్ట్ లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు పుష్పలతను అభినందించారు.

● అక్కాచెల్లెళ్లకు మూడేసి ఉద్యోగాలు


అక్కాచెల్లెళ్లు దివ్య, వకుల

బచ్చన్నపేట, మార్చి 1: వారిద్దరు అక్కాచెల్లెళ్లు.. పేదరైతు ఇంట్లో పుట్టిన బిడ్డలు. పెళ్లిళ్లు అయినప్పటికీ పట్టు వదలలేదు. మంచి ఉద్యోగం సంపాదించి చదివిన చదువుకు సార్థకత చేకూర్చాలనుకున్నారు. రాసిన మూడు పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మూడు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని మండల ప్రజలు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన నిమ్మ సక్కుబాయి ఈదిరెడ్డి దంపతులకు వకుల, దివ్య అనే ఇద్దరు కుమార్తెలు. చిన్నప్పటి నుంచి చదువులో ముందుండేవారు. పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం సాగింది. ఇంటర్, డిగ్రీ హైదరాబాద్‌లో, పీజీ ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. వకులను జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్‌కు చెందిన వంటేరు సంపత్‌రెడ్డికి, రెండో అమ్మాయి దివ్యను బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన ఉమ్మెంతల మధుసూదన్‌రెడ్డికిచ్చి వివాహం చేశారు. వకుల గృహిణిగా, దివ్య జనగామ మండలం వెంకిర్యాల పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఆగస్టు 2023లో గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల కోసం పరీక్షలు నిర్వహించగా, అక్కాచెల్లెళ్లు జనగామలో ఉంటూ ప్రిపేర్ అయ్యారు. ఫిబ్రవరి 14న పీజీటీ, 29న జూనియర్ లెక్చరర్, మార్చి 1న టీజీటీ ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ మూడింటిలోనూ అక్కాచెల్లెళ్లు ఎంపికయ్యారు. దీంతో జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో జాయిన్ అయ్యేందుకు వారు సిద్ధమయ్యారు. కాగా ఒక్క ఉద్యోగం పొందేందుకు నానా తంటాలు పడుతున్న ఈ రోజుల్లో అక్కాచెల్లెళ్లు మూడేసి ఉద్యోగాలకు ఎంపిక కావటంతో వారికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో మరిన్ని పోటీ పరీక్షలకు సిద్ధమవుతూనే ఉంటామని వారు ఆత్మస్థైర్యంతో చెబుతున్నారు.

● దంపతులకు రెండేసి ఉద్యోగాలు


గంధసిరి వెంకటేశ్వర్లు, గీత

కురవి, మార్చి 1: కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన గంధసిరి వెంకటేశ్వర్లు-గీత దంపతులు ఇటీవల విడుదలైన ఉద్యోగ పరీక్షా ఫలితాల్లో రెండేసి ఉద్యోగాలు సాధించారు. గురుకుల ఫలితాల్లో గంధసిరి వెంకటేశ్వర్లు డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపికయ్యారు. ఆయన భార్య గీత పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికయ్యారు. భార్యాభర్త రెండేసి పోస్టులకు ఎంపిక కావడం పట్ల మిత్రులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

● ఒకే వ్యక్తికి మూడు ఉద్యోగాలు

నడికూడ, మార్చి 1 : నడికూడ మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన దొంతుల కృష్ణమూర్తి పట్టుదలతో చదివి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. అయితే ఆయన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కందిగడ్డ తండా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తూ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. గురుకుల ఫలితాలల్లో గణిత శాస్త్రం విభాగంలో జేఎల్, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలను సాధించాడు. కాగా, స్వగ్రామం చర్లపల్లిలో కృష్ణమూర్తిని పలువురు అభినందించారు. కృష్ణమూర్తి ఐదుగురు సోదరులు, సోదరి ప్రభుత్వ ఉద్యోగాలు చేయడం గమనార్హం. కృష్ణమూర్తి పదో తరగతి వరకు చర్లపల్లిలో చదువుకున్నాడు. ప్రస్తుతం బీఎస్సీ, బీఈడీ పూర్తి చేశారు.

బయో కెమిస్ట్రీ ఇన్‌చార్జ్ హెడ్‌గా మధుకర్‌రావు

కేయూ క్యాంపస్, మార్చి 1: కేయూ బయో కెమిస్ట్రీ విభాగం ఇన్‌చార్జి హెడ్‌గా డాక్టర్ కె.మధుకర్‌రావును నియామిస్తూ శుక్రవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా ఉన్న జంతుశాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ జి.షమిత నుంచి బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2007లో బయోకెమిస్ట్రీ విభాగంలో అధ్యాపకులుగా మధుకర్‌రావు నియమితులు కాగా, ఇప్పటివరకు 30 పరిశోధన పత్రాలను ప్రచురించారు. మధుకర్‌రావు నియామకంపై పలువురు అభినందనలు తెలిపారు.





వివరిస్తున్న మన అగ్రిటెక్ సంస్థ ఎండీ రమేష్

మార్కెట్లో స్మార్ట్ అగ్రికల్చర్ ఎక్స్‌పో

వరంగ టౌన్, మార్చి 1: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని మన అగ్రిటెక్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్మార్ట్ అగ్రికల్చర్ మెగా ఎక్స్‌పో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కార్యదర్శి సంగయ్య, సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పాశికంటి రమేష్ హాజరై మాట్లాడుతూ.. నూతన టెక్నాలజీని వినియోగించుకుని మారుతున్న వ్యవసాయ విధానాలకు అనుగుణంగా తక్కువ శ్రమతో ఎక్కువ ఆదాయం వచ్చే అవకాశాలున్నాయన్నారు. ప్రభుత్వం కూడా రైతులకు అనేక సంక్షేమ పథకాలు, రాయితీలను అందజేస్తోందన్నారు.

వెలుగుల కోట



ఖిలావరంగల్, మార్చి 1: విద్యుత్ ధగధగల్లో పర్యాటక ప్రాంతమైన ఖిలావరంగల్ మెరిసిపోనుంది. ఈ మేరకు పనులు చకచకా సాగుతున్నారు. కాకతీయ రాజుల శిల్ప సంపద, కీర్తితోరణాలు, కళాఖండాలు, కట్టడాలు, విద్యుత్ కాంతులతో పర్యాటకులకు కనువిందు చేయనున్నాయి. ఇండియన్ ఆయిల్ ఫెడరేషన్(ఐఓఎఫ్) రూ.3కోట్లను కేంద్ర పురావస్తుశాఖకు అప్పగించింది. ఆ నిధులతో సంబంధిత అధికారులు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. నెలరోజుల నుంచి పనులు శరవేగంగా సాగుతున్నాయి. భూమిని తవ్వి లోపలి నుంచి కేబుల్స్ వేసి, శిల్పాల ముందు భాగంలో, అలాగే మధ్యమధ్యన లైట్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. రాత్రివేళల్లో కీర్తి తోరణాలు, శిల్ప కళాఖండాలు, ఆర్చి

- ఖిలావరంగల్‌లో విద్యుత్‌దీపాల ఏర్పాటు
- రూ.3కోట్లతో సాగుతున్న లైటింగ్ పనులు
- త్వరలోనే కాకతీయుల శిల్పాలు, కట్టడాలకు విద్యుత్ కాంతులు

తదితర శిల్పాలు విద్యుత్ కాంతుల్లో మెరిసిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇండియన్ ఆయిల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత సంవత్సరం హైదరాబాద్‌లోని గోల్కొండ కోటలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసింది. దీంతో గోల్కొండ విద్యుత్‌కాంతులతో మెరుస్తూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. అదే విధంగా మధ్యకోటలోని శిల్పాల ఆవరణ, ఏకశిలగుట్ట, ఖుష్ మహల్ తదితర కాకతీయుల కాలంనాటి కట్టడాలను ఆకట్టుకునేలా కేంద్ర పురావస్తు శాఖాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెలలోనే పనులు పూర్తి చేసి ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడిం చారు.





మధ్యకోటలోని ఏర్పాటైన లైట్లు



కేబుల్స్ కోసం తవ్వకాలు



శిల్పాల ఆవరణలో ఏర్పాటు చేసిన లైట్లు



మధ్యకోటలో కేబుల్స్, లైట్ల సామగ్రి

పనుల్లో వేగం పెంచాలి...

మధ్యకోటలో విద్యుత్ లైట్ల ఏర్పాటు పనులు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు, పర్యాటకులు కోరుతున్నారు. లైట్ అండ్ సౌండ్ షో పనులు, మధ్యకోట ముస్లింకాలనీ నుంచి బయటికి వెళ్లేందుకు డ్రైయినేజీ, ప్రస్తుతం శిల్పాల మధ్యన విద్యుత్‌కాంతులు ఏర్పాటు చేయడానికి గుంతలు తవ్వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

పర్యాటకులకు కనువిందు..

ఖిలావరంగల్‌కోట పర్యాటక హబ్‌గా ఏర్పాటు కానుంది. కాకతీయరాజుల కాలంలో నిర్మించిన ఎన్నో అద్భుత శిల్పసంపదలు, కీర్తితోరణాలు, ఏకశిలగుట్ట, గుండుచెరువు, ఖుష్‌మహల్, సింగారపుబావి, తదితర కట్టడాలతో పాటు, రాతి, మట్టి కోటలు పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి. శిల్పాల ఆవరణలో తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో కాకతీయరాజుల జీవితచరిత్ర, పరిపాలన విధానాన్ని తెలిపే లైట్ అండ్ సౌండ్ షో ప్రతిరోజు సాయంత్రం రెండు విడతలుగా ప్రదర్శిస్తున్నారు. స్వయంభూశంభులింగేశ్వరస్వామి శివుడి దేవాలయం, కాకతీయరాజుల నాణేలు, ఆయుధాలు, పనిముట్లు, దుస్తులను కోటలోని మ్యూజియం కనువిందు చేస్తున్నాయి. మధ్యకోటలో సుమారు 15 ఎకరాల స్థలంలో 'కుడా' ఆధ్వర్యంలో ఏకశిల పిల్లల పార్కు, గుండుచెరువు బండ్, 25 ఎకరాలలో ఏర్పాటు చేసిన మాకీటాక్ వనాలు, తదితర కట్టడాలను తిలకించేందుకు దేశవిదేశాలు ఆసక్తి చూపుతున్నారు.



సభలో మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

రాష్ట్రంలో 17ఎంపీ సీట్లు మావే..

- ప్రజలు మోదీ వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారు...
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి
- నగరంలో విజయ సంకల్ప యాత్ర ముగింపు సభ

వరంగల్ సిటీ, మార్చి 1: రాష్ట్రంలో ఉన్న 17 పార్లమెంట్ సీట్లు బీజేపీవేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ప్రారంభించిన విజయ సంకల్పయాత్ర ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్‌లో సభను ఏర్పాటు చేశారు. అంతకుముందు నాయుడు పెట్రోల్‌పంపు వద్ద ప్రారంభమైన విజయ సంకల్ప యాత్రకు తూర్పు బీజేపీ కార్యకర్తలు, ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అక్కడ నుంచి యాత్ర శంభునిపేట జంక్షన్ మీదుగా ఇసుక అడ్డాల జంక్షన్, హెడ్ పోస్టాఫీస్ సెంటర్ చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ దేశ భక్తిని చాటుకోవాల్సిన ఆవశ్యకత వచ్చిందన్నారు. దేశంలోని ఆరు రాష్ట్రాలు వందశాతం మోదీవెంట ఉన్నాయని, ఆ కోవలోకే తెలంగాణ చేరాలని ఆకాంక్షించారు. తెలంగాణ అభివృద్ధికి బాటలు వేస్తున్న ప్రధాని మోదీని మరోసారి ఆశీర్వదించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అహంకారం, అవినీతితోనే గద్దెదిగిందని, కాంగ్రెస్ కుటుంబ పార్టీ అని ఎద్దేవా చేశారు. మోదీకి దేశ ప్రజలే కుటుంబమని, రామరాజ్య స్థాపన కోసమే అయోధ్యలో రామ మందిర నిర్మాణం చేపట్టారన్నారు. భద్రాద్రి రాముని పాదాల చెంత ప్రారంభమైన విజయ సంకల్ప యాత్ర భద్రకాళీ అమ్మవారి చెంత ముగిసేంత వరకు బ్రహ్మరథం పట్టిన ప్రజలందరికీ, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం యాత్ర వరంగల్ చౌరస్తా, పోచమ్మమైదాన్ మీదుగా భద్రకాళీ ఆలయం చేరుకుంది. అమ్మవారి దర్శనం అనంతరం యాత్ర ముగిసిందని నాయకులు ప్రకటించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కృష్ణప్రసాద్, ముళీధర్‌గౌడ్, చాడ శ్రీనివాస్‌రెడ్డి, మార్తినేని ధర్మారావు, ఎడ్ల అశోక్‌రెడ్డి, కుసుమ సతీష్, వన్నాల శ్రీరాములు, వన్నాల వెంకటరమణ, సిద్ధం నరేష్, కొండేటి శ్రీధర్, జలగం రంజిత్‌రావు, రత్నం సతీష్‌సా, బాకం హరిశంకర్, కనుకుంట్ల రంజిత్, మహేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: రేవూరి



కల్యాణ లక్ష్మీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

వరంగల్(మామునూరు), మార్చి 1: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. బొల్లికుంట రైతువేదిక భవనంలో శుక్రవారం గాడెపల్లి, స్తంభంపల్లి, బొల్లికుంట, వసంతాపూర్, దూపకుంట, ఆదర్శనగర్, గరీబ్‌నగర్ విలీన గ్రామాలకు చెందిన షాదీముబారక్, కల్యాణ లక్ష్మీ లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. చెక్కుల పంపిణీలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో 17వ డివిజన్ కార్పొరేటర్ గద్దె బాబు, మండల రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఆనంద్, కాంగ్రెస్ నాయకుడు గన్నోజు శ్రీనివాస చారి, ఖిలావరంగల్ సొసైటీ వైస్ చెర్‌పర్సన్ సోల్తి భూమాత, సొసైటీ డైరెక్టర్ వేమన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పి.వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోడ్లపైనే వాహనాల మరమ్మతులు

ఆటోనగర్ రోడ్డులో స్థానికుల ఇబ్బందులు



రోడ్ల పైనే వాహనాలకు మరమ్మతులు



రోడ్డు పైనే మెకానిక్ షాపు

పోచమ్మమైదాన్, మార్చి 1: వరంగల్ ఆటోనగర్ ప్రాంతంలో పలువురు రోడ్ల పైనే వాహనాలకు మరమ్మతులు చేస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆటోనగర్ ప్రాంతంలోని కొత్తవాడకు వెళ్లే దారిలో పలువురు ప్రధాన రహదారి పైనే మెకానిక్ షాపులు ఏర్పాటు చేసి ఆటోలకు, ఇతర వాహనాలకు మరమ్మతులు చేస్తున్నారు. ఇరుకుగా ఉన్న రోడ్ల పైనే వాహనాల రిపేరు చేస్తుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. అంతేకాక పిల్లలు స్కూల్‌కు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుపై నడవడమే కష్టంగా మారిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి రోడ్డుకు అడ్డంగా వాహనాలు మోహరించకుండా, రోడ్ల పై మరమ్మతులు చేయకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

వరంగల్ కలెక్టరేట్, మార్చి 1: వరంగల్ ఉమ్మడి జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగులకు షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ ద్వారా ఐదు నెలల ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల శాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీ పరీక్షలకు హనుమకొండలోని షెడ్యూల్ క్యాస్ట్ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 6 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారికి 10న పరీక్ష నిర్వహించబడునని, ఉత్తీర్ణులైన వారికి 18 నుంచి ఆగస్టు 17 వరకు స్టడీ సర్కిల్‌లో తరగతులు జరుగుతాయన్నారు. వివరాలకు9542834507లో సంప్రదించాలన్నారు.

మిర్చి బస్తాలకు నిప్పు



వరంగల్‌టౌన్, మార్చి 1: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో గురువారం రాత్రి ఓ రైతు తన మిర్చి బస్తాలకు గిట్టుబాటు ధర పలుకలేదన్న బాధతో మిర్చి బస్తాలకు పెట్రోల్‌పోసి నిప్పుపెట్టిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. జనగామ జిల్లా పాలకుర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన గుగులోతు జగన్ 24 బస్తాల మిర్చిని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు అమ్మకానికి తీసుకొచ్చాడు. గురువారం పెద్ద ఎత్తున మిర్చి బస్తాలు అమ్మకానికి రావడంతో జగన్ బస్తాలను కొనేందుకు వ్యాపారులు రాలేదు. పక్కన ఉన్న మిర్చి బస్తాలకు పలికిన ధరను చూసిన జగన్ తాను తీసుకువచ్చిన తేజ రకం మిర్చికి గిట్టుబాటు ధర పలుకదేమోనన్న అనుమానంతో గురువారం రాత్రి అసహనంతో మిర్చి బస్తాలకు నిప్పు పెట్టాడు. వెంటనే పక్కనున్న రైతులు తేరుకుని మిర్చి బస్తాలకు అంటుకున్న మంటలను ఆర్పివేశారు. రెండు మిర్చి బస్తాల్లోని మిర్చి స్వల్పంగా దహనమైంది. సమాచారం అందుకున్న మిర్చి యార్డు అధికారులు రైతు వద్ద చేరుకుని భరోసా కల్పించారు. విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. శుక్రవారం ఆ రైతు బస్తాలను తేజ రకం మిర్చి క్వింటాకు రూ.14వేలు, తాలు రకం మిర్చికి 11 వేలకు విక్రయించేలా ఏర్పాట్లు చేశారు. దీంతో రైతు ఊపిరి పీల్చుకున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

వరంగల్(సంగెం), మార్చి 1 : సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ వెంకయ్య సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏపీజీవీబీ బ్యాంకు ఆధ్వర్యంలో విద్యా భారతి హైస్కూల్‌లో సైబర్ ఆర్థిక నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆన్‌లైన్ మార్కెటింగ్, క్యూఆర్ కోడ్ ద్వారా జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండి తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఐసీ కౌన్సిలర్ మౌనిక, స్కూల్ హెచ్ఎం చందర్ పాల్గొన్నారు.

పరిశోధనల్లో ప్రజావసరాలకు ప్రాధాన్యం

- ఈ దిశగా సరికొత్త ఆవిష్కరణలు
- గ్రిడ్ ఇండియా డైరెక్టర్ రాజీవ్ పోర్వాల్ పిలుపు
- నిట్‌లో సుస్థిర విద్యుత్, శక్తిపై అంతర్జాతీయ సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న రాజీవ్ పోర్వాల్

హనుమకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు సామాన్యుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని శాస్త్ర, సాంకేతికరంగాల్లో సరికొత్త ఆవిష్కరణలను చేయాలని గ్రిడ్ ఇండియా డైరెక్టర్ (సిస్టమ్ ఆపరేషన్) డైరెక్టర్ రాజీవ్ పోర్వాల్ పిలుపునిచ్చారు. సాంకేతిక నిపుణుల కృషి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే లక్ష్యంగా సాగాలన్నారు. వరంగల్ నిట్ కళాశాలలో శుక్రవారం సుస్థిర విద్యుత్, శక్తిపై అంతర్జాతీయ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాజీవ్ పోర్వాల్ మాట్లాడుతూ.. ప్రపంచంలో సింక్రోనస్ గ్రిడ్, మైక్రోగ్రిడ్‌లో వివిధ సవాళ్లను ఎదుర్కోవడంలో భారతదేశం అగ్రభాగాన ఉందన్నారు. ఇంధన రంగంలో ఆవిష్కరణల ప్రాముఖ్యత, ఈ రంగంలో లాభాలను గడించడానికి, ఇందుకు సంబంధించిన పరిశ్రమలతో చురుకుగా సహకరించడానికి నిట్ వంటి సాంకేతిక కళాశాలలు తోడ్పాటు అందించాల్సిన ఆవశ్యకతను ఆయన ఈ సందర్భంగా వివరించారు.

ఢిల్లీ ఐఐటీ ప్రొఫెసర్ భీమ్ సింగ్ మాట్లాడుతూ.. నిట్ వంటి అత్యున్నత సాంకేతిక కళాశాల నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఉద్యోగాలలో స్థిరపడ డంతోనే సరిపెట్టుకోకుండా కంపెనీలను ప్రారంభిం చి తద్వారా ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా దృష్టిపెట్టాలని పిలుపునిచ్చారు. హిటాచీ ఎనర్జీ ఇం డియా లిమిటెడ్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అకిటూర్ రెహమాన్ మాట్లాడుతూ.. 2030 నాటికి మన దేశం పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి 500 జీడ బ్ల్యూ శక్తిని ఏకీకృతం చేయడం లక్ష్యంగా పెట్టుకు న్నదన్నారు. వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి ప్రసంగి స్తూ.. ఎనర్జీ గ్రిడ్‌ల ఆవశ్యక త, స్వచ్ఛమైన వనరుల ద్వా రా శక్తి ఉత్పత్తి, వాటి ప్రాము ఖ్యతను ప్రధాన ఎత్తి చూపారు. అంతర్జాతీయ ఒప్పందా లలో పేర్కొన్న ప్రతి ష్టాత్మక లక్ష్యాలను సాధించడానికి మన దేశం యత్ని స్తున్నద న్నారు. నికర సున్నా ఉద్గారాల వైపు పునరుత్పాదకాలను వేగంగా ఏకీకృ తం చేసే కృషి జరుగుతోందన్నారు. ఈ సదస్సులో ఎన్ఐటీడబ్ల్యు డీన్ (ఆర్అండ్‌డీ) ప్రొఫెసర్ వీటీ సోమశేఖర్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ బీఎల్ నర్సింహరాజు తదితరులు పాల్గొన్నారు. నిట్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో జరిగిన ఈ సదస్సులో దేశంలోని వివిధ నిట్, ఐఐటీ కళాశాలల నుంచి పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు. వరంగల్ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో మొత్తం 292 పరిశోధనాపత్రాలను సమర్పించారు. వీటిలో 114 పత్రాలను ప్రదర్శనకు అంగీకరించారు.



షేక్ ఆదాంను పార్టీలోకి ఆహ్వానిస్తున్న స్వర్ణ

కాంగ్రెస్‌లో చేరిన మైనారిటీ నాయకుడు ఆదాం

పోచమ్మమైదాన్, మార్చి 1: మూడో డివిజన్ ఆరెపల్లికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత, వర్ధన్నపేట నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు షేక్‌ఆదాం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ శుక్రవారం హన్మకొండలోని ఆమె నివాసంలో ఆదాంతోపాటు డివిజన్ మైనారిటీ అధ్యక్షుడు ఎమ్డీ రబ్బానీ, టీడీపీ నాయకుడు తిప్పని రాజ మొగిలి, బీజేపీ నాయకుడు ఎమ్డీ మాషుక్‌లకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించే షేక్‌ఆదాం మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావులకు అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వరంగల్ మండల అధ్యక్షుడు జన్ను సుధాకర్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ ఉస్మాన్‌అలీ, డివిజన్ అధ్యక్షుడు జన్ను అరుణాకర్, వెంకటేశ్వర్‌రావు, చంద్రయ్య పాల్గొన్నారు.

మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయించొద్దు : సీఐ



పాన్‌షాప్ నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ

కరీమాబాద్, మార్చి 1: నిబంధనలు అతిక్రమించి పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు తప్పవని మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య పాన్‌షాప్ నిర్వాహకులను హెచ్చరించారు. శుక్రవారం శంభునిపేటలో పాన్‌షాప్, వీధి వ్యాపారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. 18 ఏళ్ల నిండని వారికి పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాన్‌షాప్ వద్ద సూచిక బోర్డులను ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రధాన జంక్షన్‌లో రాత్రి 9గంటల లోపు వ్యాపారం, షాపులను ముగించాలన్నారు.

ఉన్నత లక్ష్యాలతో చదవాలి

గీసుగొండ, ఫిబ్రవరి 1: విద్యార్థులు ఉన్నత లక్ష్యాల కోసం క్రమశిక్షణతో చదవాలని సీఐ బాబులాల్ అన్నారు. గీసుగొండ జెడ్పీ పాఠశాల టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఆయన శుక్రవారం అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పట్టాభి, ఉపాధ్యాయులు జ్యోత్స్నప్రభ, విట్టోభ, పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ బహూకరణ

గీసుగొండ, ఫిబ్రవరి 1: గంగదేవిపల్లి పాఠశాలకు విశ్వ ఫౌండేషన్ అగ్నిహోత్ర టీం సభ్యులు శుక్రవారం వాటర్ ప్యూరీఫైడ్ ప్లాంట్‌ను అందచేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రజాక్, మాజీ సర్పంచ్ గోనె మల్లారెడ్డి, టీం సభ్యులు గొంగ శ్రీనివాస్, వేణుగోపాల్, సత్యనారాయణ, కుమారస్వామి, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



ప్యూరీఫైడ్ ప్లాంట్‌ను బహూకరిస్తున్న సభ్యులు



లైబ్రరీకి పుస్తకాల వితరణ

పర్వతగిరి(వరంగల్), మార్చి 1: పర్వతగిరి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల లైబ్రరీకి లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో లీడ్ చిల్డ్రన్స్ లైబ్రరీ వ్యవస్థాపకులు కాసుల రవికుమార్-శోభారాణిలు శుక్రవారం పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా నోడల్ ఆఫీసర్ గాయపు లింగారెడ్డి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా, స్వేరో జిల్లానాయకుడు గారె జయరాజ్, జంగిలి యాకయ్య, బానోత్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను బహూకరిస్తున్న దాతలు

ద్విచక్ర వాహనం, ఆటో ఢీ

పలువురికి గాయాలు



ధ్వంసమైన ఆటో

వర్ధన్నపేట రూరల్, మార్చి 1 : ఆటోను ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆటో వర్ధన్నపేట నుంచి ప్యాసెంజర్లను ఎక్కించుకుని జఫర్‌గడ్ వెళ్తుండగా, జఫర్‌గడ్ నుండి వర్ధన్నపేట వైపు వస్తున్న ద్విచక్ర వాహనం మూలమలుపు వద్ద వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఆటో బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బురిగం కళావతి, గాండ్ల సంధ్య, కొండేటి సోమలక్ష్మి, కొండుజు విశ్వనాథంతో పాటు మరో నలుగురికి గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న కనకల అరుణ అనే మహిళకు తలకు తీవ్ర గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, ద్విచక్ర వాహనం పై ప్రయాణిస్తున్న చిట్టిమల్ల బాబు, చిట్టిమల్ల జనార్ధన్‌లకు కాళ్లు విరగడంతో వారం దరినీ వరంగల్ ఎంజీఎం తరలించారు. స్వల్ప గాయాలైన వారిని వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి

బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు

వర్ధన్నపేట, మార్చి 1 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కుటుంబ పాలనకు చరమగీతం పాడి తగిన గుణపాఠం చెప్పాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. వర్ధన్నపేట పట్టణంలో బీజేపీ విజయ సంకల్ప యాత్ర బహిరంగ సభ వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ ముత్తిరెడ్డి కేశవరెడ్డి శుక్రవారం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే సోనియా కుటుంబాన్ని, బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే కేసీఆర్ కుటుంబాన్ని గెలిపించినట్లేనని ప్రజలు గమనించి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం పక్కా ఇళ్లు కట్టిస్తానంటే నేనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కటిస్తానని మాజీ సీఎం కేసీఆర్ ఆ నిధులు తెచ్చుకొని ఆ నిధులు తన ఖాతాలో వేసుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి గ్యారంటీల పథకాన్ని వాడుకొని ఆ పథకాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందన్నారు. రైతుబంధు నేటికి రైతుల ఖాతాల్లోకి జమ చేయలేదని, రుణం లేని వారు రుణం తెచ్చుకొని సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తక్షణమే మాఫీ చేస్తానని హామీ ఇచ్చి దాని గురించి మాట్లాడడం లేదన్నారు. ఉత్తర ప్రగల్భాలు పలికిన నాయకులకు గత ఎన్నికల్లో గుణపాఠం చెప్పారన్నారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ పక్క దేశం పాకిస్తాన్ బాగుండాలనే నినాదంతో కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను పక్కదారి పట్టించేందుకు మైనార్టీ నినాదాన్ని వాడుకోవాలని చూడడమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ముచ్చటగా మూడోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు బీజేపీ భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. వరంగల్ పార్లమెంట్ స్థానం 40 ఏళ్ల క్రితమే బీజేపీని గెలిపించిన ఘన చరిత్ర ఉందని రాబోయే ఎన్నికల్లో సైతం 2 లక్షల మెజార్టీతో గెలుపు ఖాయమని సర్వేలు చెబుతున్నాయని తెలిపారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో వర్ధన్నపేట నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోక వెనుకబడిపోయిందన్నారు. కార్యక్రమంలో మాజీ డీజీపీ టి.కృష్ణ ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, చీటూరి అశోక్, వన్నాల శ్రీరాములు, ముత్తిరెడ్డి కేశవరెడ్డి, టి.శ్రీదేవి, గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, చాడ శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలి

వర్ధన్నపేట, మార్చి 1 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లం దాస్ కుమార్ అన్నారు. వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2019 సంవత్సరంలో జరిగిన పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను ఇంత వరకు అమలు చేయలేదన్నారు. త్వరలోనే జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించి తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మతోన్మాద విధానాలను రెచ్చగొడుతూ తొమ్మిదేళ్లుగా పాలన సాగిస్తున్నారన్నారు. 800 మంది రైతులు ప్రాణాలు పోయినా పట్టించుకోని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులను ఇబ్బందులకు గురి చేసిన ప్రభుత్వ మనుగడ కష్టమని తెలిపారు.

విద్యార్థులు బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

వర్ధన్నపేట రూరల్, మార్చి 1 : విద్యార్థులు బ్యాంకు సేవలపై అవగాహన కలిగి ఉండి, వాటిని వినియోగించుకునేలా ఉండాలని ఏపీజీవీబీ ఎఫ్‌ఎల్‌సీ కౌన్సిలర్ ప్రేమ్ కుమార్ అన్నారు. మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో శుక్రవారం ఏపీజీవీబీ ఇల్లంద బ్రాంచ్ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బ్యాంకులు పొదుపు ఖాతాలు, రుణాలు అందిస్తుందని తెలిపారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, విద్యా రుణాలు, మొబైల్ బ్యాంకింగ్, బీమ్ యాప్స్ గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మహేష్, సీఎఫ్‌ఎల్ కమలాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన విషయాలపై అధ్యయనం చేయాలి

చెన్నారావుపేట, మార్చి 1: విద్యార్థుల నూతన విషయాలపై అధ్యయనం చేయాలని గ్రామ గురువు యాగారెడ్డి అన్నారు. మండలంలోని తిమ్మరాయిన్‌పహాడ్ గ్రామంలో సెయింట్ థెరిస్సా పాఠశాలలో శుక్రవారం సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన రకరకాల ఎగ్జిబిట్స్ ఎంతో బాగున్నాయని అన్నారు. పాఠశాలలో కొత్త కొత్త కార్యక్రమాలు చేపట్టడంతో విద్యార్థులల్లో నూతన ఉత్సాహం వస్తుందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయానికి సైన్స్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. అనంతరం పాఠశాలలో ఆన్యువల్ డే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రజలీనా, హెచ్‌ఎం శైరీ, ఫాదర్ రాఘవరెడ్డి, సీతారామాచర్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ప్రకటనపై యూత్ కాంగ్రెస్ నాయకుల హర్షం

వర్ధన్నపేట, మార్చి 1 : మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేసిన నేపథ్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం వర్ధన్నపేట పట్టణకేంద్రంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం వల్ల నిరుద్యోగ సమస్య తీరే అవకాశం ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఉద్యోగ ప్రకటనను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బర్ల సతీష్, ఆకుల పవన్‌కళ్యాణ్, తరుణ్, బిర్రు రాజు, కైత రాజు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యం

రాయపర్తి, మార్చి 1 : గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజల దాహార్తిని తీర్చడమే లక్ష్యంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి కృషి చేస్తోందని గ్రామపార్టీ అధ్యక్షుడు తీగల సాయిలు అన్నారు. శుక్రవారం మండలంలోని పెర్కవేడు గ్రామంలో గ్రామ వాటర్ ప్లాంట్ ఏర్పాటు కోసం బోరు బావి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో శుద్ధమైన నీటిని ప్రజలకు అందించేలా ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డిలు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బొమ్మెర శ్రీనివాస్, ఉప్పలయ్య, నరేందర్, నాగరాజు, కుమారస్వామి, బొమ్మెర యాదగిరి, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ

చెన్నారావుపేట, మార్చి 1: మండలంలో ఉన్న భూములల్లో రైతుల ధరణికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరణ చేస్తున్నట్లు తహసీల్దార్ ఫణికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ధరణి వెబ్‌సైట్‌లో 110 మంది రైతుల భూ సమస్యలు ఉన్నయని, రైతులు దరఖాస్తులు అందించిన వెంటనే పరిష్కారం చేయటం జరుగుతుందన్నారు. భూ సమస్యలున్న రైతులు తమ దరఖాస్తులను అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ స్వామి, వీర్‌ఏలు శోభ, రాజశేఖర్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రాయపర్తి, మార్చి 1 : మండలంలోని సన్నూరు జయరాం తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తెజావత్ సంతోష్ నాయక్ కుమారుడు ప్రభాస్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఎస్‌ఆర్‌ఆర్ ఇన్ఫ్రా డెవలపర్స్ అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి రూ. 21 వేల తక్షణ ఆర్థిక సహాయం అందించి ఉదారత చాటుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పర్వతగిరి(వరంగల్), మార్చి 1: పర్వతగిరి మండలంలోని బూర్గుమళ్ల, కొంకపాక ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడానికి గాను శనివారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ చంద్రమౌళి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఎస్సైగా బాధ్యతలు స్వీకరణ



అరుణ్

చెన్నారావుపేట, మార్చి 1: చెన్నారావుపేట మండల ఎస్సైగా గూడ అరుణ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్సై పస్తం శ్రీనివాస్ హనుమకొండకు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో జనగామ పట్టణంలో ఎస్సైగా పని చేస్తున్న అరుణ్ బాధ్యతలు స్వీకరించటం జరిగింది. పలువురు ఎస్సైని అభినందించారు.

ఖానాపురం ఎస్సైగా రఘుపతి



రఘుపతి

ఖానాపురం, మార్చి 1: ఖానాపురం ఎస్సైగా సీహెచ్ రఘుపతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా ఇంతవరకు ఇక్కడ పనిచేసిన ఎస్సై బొంగు మాధవ్‌గౌడ్ బదిలీపై నర్సంపేటకు వెళ్లగా రఘునాథపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన రఘు పతి ఖానాపురానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు సహకరించాలని అన్నారు. యువత సన్మార్గంలో నడవాలని సూచించారు.

నెక్కొండ ఎస్సైగా మహేందర్



మహేందర్

నెక్కొండ, మార్చి 1 : నెక్కొండ ఎస్సైగా నియమితులైన ఎం. మహేందర్ శుక్రవారం విధుల్లో చేరారు. జఫర్‌గడ్ పోలీసుస్టేషన్ నుంచి మహేందర్ నెక్కొండకు బదిలీపై వచ్చారు. నెక్కొండ ఎస్సైగా విధులను నిర్వహించిన షేక్ జాన్‌పాషా బదిలీపై గీసుకొండ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. మండలంలో శాంతి భద్రతలను కాపాడేందుకు సహకరించాలనినూతన ఎస్సై మహేందర్ కోరారు.

ఇంటి పన్నులు సకాలంలో చెల్లించాలి

వర్ధన్నపేట, మార్చి 1 : వర్ధన్నపేట పట్టణ ప్రజలకు సకాలంలో ఇంటి పన్నులను చెల్లించాలని మునిసిపల్ కమిషనర్ జోనా అన్నారు. శుక్రవారం వర్ధన్నపేటలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 2022-23 సంవత్సరం వరకు ఉన్న ఇంటి పన్నుపై పెనాల్టీలో 90శాతం రాయతీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ విషయం పట్టణ వాసులు గమనించి ఇంటి పన్నులను సకాలంలో చెల్లించాలని సూచించారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

చెన్నారావుపేట, మార్చి 1: మండలంలోని ఎల్లాయిగూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలను బోధించారు. హెచ్‌ఎంగా బోడ రాజేందర్, డీఈవోగా వేముల రాంచరణ్, పీఈటీలుగా తరుణ్‌లు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలను బోధించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంగోతు భద్రయ్య, స్వామి, కుమారస్వామి, యాకయ్య, ర.జిత, స్వర్ణలత, రమాదేవి, అనిత, పావని పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పర్వతగిరి(వరంగల్), మార్చి 1: పర్వతగిరి మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సమావేశానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరవుతారని తెలిపారు. అందరూ హాజరవ్వాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

వర్ధన్నపేట, మార్చి 1: వర్ధన్నపేట పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా పథకం ద్వారా రూ.436 చెల్లించి ఎస్‌బీఐలో ఇన్సూరెన్స్ చేయించుకున్నారు. మండలంలోని కక్కిరాలపల్లి గ్రామానికి చెందిన ఖాతాదారుడు హైమద్ అలీ, బండౌతాపురం గ్రామానికి చెందిన పనికెర కొమురయ్యలు వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలు ఇన్సూరెన్స్ చేయించుకోవడంతో వారికి శుక్రవారం ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ బంగారయ్య బాధిత కుటుంబ సభ్యులకు ఇన్సూరెన్స్ ద్వారా క్లెయిమ్ అయిన రెండు లక్షల రూపాయల విలువైన చెక్కులను ఇరు కుటుంబాలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ రామగిరి శ్యాంప్రసాద్, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యోదయ్ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలి



పీఎం సూర్యోదయ్ పథకం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

నర్సంపేట టౌన్, మార్చి 1: పీఎం సూర్యోదయ్ తపాల పథకాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని తపాల కార్యాలయంలో పీఎం సూర్యోదయ్ కరపత్రాలను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెరిగిన విద్యుత్ ఖర్చులు తగ్గించుకోలేక, బిల్లులు చెల్లించలేక సతమతమవుతున్న వారికి సౌర విద్యుత్ ఓ చక్కని అవకాశమని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రజలకు రుణ భారం లేకుండా భారీగా సబ్సిడీ ఇస్తూ సోలార్ సిస్టమ్‌ను అందజేసేందుకు పీఎం సూర్యోదయ్ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులు రూ.78వేల వరకు సబ్సిడీ పొందవచ్చన్నారు. కావాల్సిన వారు తపాల కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డేపల్లి నర్సింహరాములు, పట్టణ అధ్యక్షుడు బాల్నే జగన్, శీలం సత్యనారాయణ, గూడూరు సందీప్, విజయ్‌సింగ్, రమేష్ పాండే పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధన కోసం పాటుపడాలి



అమరవీరుల చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీ వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

నర్సంపేట టౌన్, మార్చి 1: ఎస్సీ వర్గీకరణ కోసం జరిగిన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల ఆశయ సాధన కోసం మాదిగ ప్రజలు పాటుపడాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు కల్లెపెల్లి ప్రణయ్‌దీప్‌మాదిగ పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో శుక్రవారం అమరవీరుల చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీకి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ మాదిగ అమరవీరుల త్యాగాలు, బీజేపీ తోనే సాధ్యమవుతుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు బీజేపీ గెలుపు కోసం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తడుగుల విజయ్, బాబు, రాజుయాదవ్, నారాయణ, సురేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం రికార్డులు, పనుల తనిఖీ



రికార్డులు, అభివృద్ధి పనులు తెలుసుకుంటున్న నోడల్ అధికారి

దుగ్గొండి, మార్చి1: మండలంలోని నాచినపల్లి సహకార సంఘంతో పాటు సబ్ సెంటర్లను శుక్రవారం జిల్లా సహకార సంఘం అధికారి(డీసీవో) నోడల్ అధికారి నాగనారయణలు సందర్శించి రికార్డులు, అభివృద్ధి పనులు, స్టాక్ వివరాలను తనిఖీ చేశారు. ఇటీవల సహకార సంఘం ఉపాధ్యక్షుడు గుడిపెల్లి ధర్మారెడ్డితో పాటు కొంత మంది డైరెక్టర్లు సహకార సంఘంలో నిధులు దుర్వినియోగం కావడం జరిగిందని పనులు కాకుండనే బిల్లులు తీసుకున్నట్లు జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా అధికారి సంజీవరెడ్డి, నోడల్ అధికారి నాగనారాయణలు సందర్శించి రికార్డులలతోపాటు తిమ్మంపేట, లక్ష్మీపురం సెంటర్లను సొసైటీ అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, వైస్ ప్రెసిడెంట్ గుడిపెల్లి ధర్మారెడ్డిల సమక్షంలో తనిఖీ చేశారు. తిమ్మంపేటలో గోదాము నిర్మాణ పనులను పరిశీలన చేశారు. రైతులకు సంబంధించిన స్టాక్‌ను తనిఖీ చేశారు. సీఈవో స్వామి ఓంకార్, డైరెక్టర్ పురుషోత్తం, స్టాఫ్ సుధాకర్, రజిని పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఆదర్శంగా నిలిచిన జీవన్



జీవన్

నర్సంపేట టౌన్, మార్చి 1 : గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగ ఫలితాల్లో టీజీటీ, పీజీటీలో ఎంపికైనప్పటికీ మరో నిరుద్యోగికి అవకాశం కల్పించడంతో టీజీటీ సర్టిఫికేషన్‌కు వెళ్లకుండా ఆదర్శంగా నిలిచాడు నర్సంపేట పట్టణానికి చెందిన కేతిరెడ్డి జీవన్. జీవన్ ఉపాధ్యాయ ఉద్యోగ ఫలితాల్లో భాగంగా టీజీటీ, పీజీటీ, జేఎల్(ఇంగ్లీష్) మూడు విభాగాల్లోనూ 1:2 లో ఎంపికయ్యారు. జేఎల్ ఫైనల్ తప్పినప్పటికీ టీజీటీ, పీజీటీలో విజయం సాధించారు. తనలాంటి నిరుద్యోగికి అవకాశం కల్పించడానికి టీజీటీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ లేదని, పీజీటీ ఉద్యోగం సాధించానని జీవన్ తెలిపారు.

మేడిగడ్డకు తరలిన బీఆర్‌ఎస్ నాయకులు



నర్సంపేట నుంచి మేడిగడ్డకు వెళ్లిన బీఆర్‌ఎస్‌నాయకులు

వరంగల్(నర్సంపేట), మార్చి 1 : మేడిగడ్డ ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ఎండగట్టి ప్రజలకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అందుతున్న వివరించేందుకు టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో చేపట్టిన చలో మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శన కార్యక్రమానికి నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. అక్కడ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఇతర నేతలను కలిశారు. మేడిగడ్డ సందర్శన కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్, జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మునిసిపల్ వైస్ చైర్మెన్ మునుగాల వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు రాయిడి దుశ్యంత్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, గంప రాజేశ్వర్, దేవోజు సదానందం, గందె చంద్రమౌళి, వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● నెక్కొండ : కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ పార్టీ ఎదురుదాడే లక్ష్యంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో చేపటిన మేడిగడ్డ యాత్రకు శుక్రవారం నెక్కొండ నుండి బీఆర్‌ఎస్ నేతలు తరలివెళ్లారు. నెక్కొండ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సంగని సూరయ్య, ఎంపీపీ జాటోతు రమేశ్, వైస్ ఎంపీపీ కర్పూరపు శ్రీనివాస్, నాయకులు గుంటుక సోమయ్య, సూరం రాజిరెడ్డి, దొనికన సారంగపాణి, బొల్లబోయిన వీరస్వామి, తోట సాంబయ్య, బల్ల వెంకన్న, మాతంగి రాజు, బక్కి కుమారస్వామి తరలివెళ్లారు.

● రాయపర్తి : బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు చలో మేడిగడ్డకు రాయపర్తి మండల బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా కరుణపురంలో జాతీయ రహదారిపై మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి కేటీఆర్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సంస్థాగత బలోపేతమే లక్ష్యం : ఎర్రబెల్లి స్వర్ణ



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న జక్కి శ్రీకాంత్ తదితరులు

వర్ధన్నపేట రూరల్, మార్చి 1 : కాంగ్రెస్ పార్టీని గ్రామీణ ప్రాంతాల్లో సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ వరదరాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దొమ్మాటి సాంబయ్యలు అన్నారు. మండలంలోని నల్లబెల్లి గ్రామానికి చెందిన మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జక్కి శ్రీకాంత్ 50 మంది అనుచరులతో కలిసి శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సొంత గూటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీని అన్ని విధాలుగా బలోపేతం చేయాలన్నారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు సంసిద్ధం కావాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నాడని, ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజలకు కాంగ్రెస్ విధానాలను తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరారపు రవికుమార్, చిన్నపెల్లి రాజు, కుమార్, బుర్ర చందర్, బిర్రు యాకయ్య, కర్ర శ్రీనివాస్‌రెడ్డి, పొలసాని దేవేందర్‌రావు, సహదేవ్, చింత బాబు, ఏలియా, యాకయ్యసమ్మయ్య, చంద్రయ్య, నాగరాజు, రమేష్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.